క్లుప్తంగా

విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసరావు

ఏలేశ్వరం: దోమకాటుకు గురికాకుండా విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో సోమవారం దోమ కాటుతో వచ్చే వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దోమలతో అనేక రకాల వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. పరిసరాల శుభ్రతతో దోమలను నివారించవచ్చన్నారు.

పండ్ల తోటల ఫలసాయానికి 13న వేలం

తుని రూరల్: తేటగుంట ఉద్యాన క్షేత్రంలోని వివిధ రకాల పండ్ల తోటలలో ఫలసాయం తీసుకునేందుకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కాకినాడ జిల్లా ఉద్యాన అధికారి కె.మల్లికార్జునరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 17.79 ఎకరాల్లో 335 మామిడి, 140 జీడిమామిడి, 156 జామ, 97 సపోట, 135 కొబ్బరి, మూడు ఉసిరి, రెండు పనస, మూడు వెలగ, 14 చింత చెట్ల ఫలసాయానికి బుధవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి వేలం నిర్వహిస్తామన్నారు. వేలం దక్కించుకున్నవారు అదే రోజు మొత్తం సొమ్ము చెల్లించాలన్నారు. లేకుంటే కనీసం 50 శాతం సొమ్ము చెల్లించి, మిగిలిన మొత్తాన్ని వారం రోజుల్లో చెల్లించాలని అన్నారు.

ఉత్సాహంగా వన సమారాధన



రాచపల్లి అడ్డురోడ్డు వద్ద ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న మహిళలు

ప్రత్తిపాడు రూరల్: రాచపల్లి అడ్డురోడ్డు సమీపంలోని మామిడితోటలో ధర్మవరం ధ్యాన మండలి ఆధ్వర్యంలో భారీ వన సమారాధన నిర్వహించారు. కుటుంబ సభ్యులతో సహా తరలివచ్చి మామిడి తోటలో ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేసి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉల్లాసంగా గడిపారు. గ్రామ పెద్దలు, భారీ ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలని వినతి

గోకవరం: మిచాంగ్ తుపానుతో నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని తంటికొండకు చెందిన రైతులు సోమవారం తహసీల్దార్ ఎ.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. భారీ వర్షాలతో పంటలు పూర్తిగా మునిగిపోయాయని, ధాన్యం మొలకెత్తుతుందని వారన్నారు. అధికారులు ఆన్‌లైన్ ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని షరతులు పెడుతున్నారని అన్నారు. రైతులు బద్దిరెడ్డి అచ్చన్నదొర, బద్దిరెడ్డి రవి, మలిరెడ్డి సిరి, గునిపే భరత్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యనందించండి



శంఖవరంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఆదిలక్ష్మి

శంఖవరం: విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక కేజీబీవీని ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. బాల్య వివాహాలు, వ్యక్తిగత సంరక్షణ, బాలల చట్టాలు వంటి అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా బాలల సంక్షేమ కమిటీ సభ్యురాలు మహాలక్ష్మి, కేజీబీవీ ప్రిన్సిపాల్ బాల కుమారి పాల్గొన్నారు.

పగలే వెన్నెల



దిబ్బలపాలెంలో పగలు వెలుగుతున్న వీధిదీపాలు

ఏలేశ్వరం: రాత్రి వేళల్లో వెలగాల్సిన వీధి దీపాలు పట్టపగలూ వెలుగులు జిమ్ముతున్నాయి.. ప్రజాధనాన్ని వృథాగా మార్చుతున్నాయి. ఏలేశ్వరంలోని దిబ్బలపాలెం, సువ్వయ్యమ్మపేట, సాయినగర్, షిర్డీనగర్‌లలో కొన్నిరోజులుగా వీధిదీపాలు పగలూ వెలుగుతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



శృంగవరం- మెరక చామవరం సమీపంలోని నందనవనంలో నందీశ్వరునికి మహాభిషేకం



తేటగుంట శివాలయంలో సామూహిక పూజలు చేస్తున్న భక్తులు



గోకవరంలో పర్వతవర్ధనీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు



ప్రత్తిపాడులోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లు



ఏలేశ్వరం శివాలయంలో భక్తుల పూజలు

సర్వాయ.. సదా శివాయ

- భక్తిశ్రద్ధలతో కార్తిక సోమవారం పూజలు
- కిటకిటలాడిన శైవక్షేత్రాలు



ఏలేశ్వరం శివాలయంలో ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

తుని రూరల్/ ఏలేశ్వరం/ తొండంగి/ రౌతులపూడి/ గండేపల్లి/ గోకవరం/ ప్రత్తిపాడు, అన్నవరం: హరహర మహాదేవ శంభో శంకర నామస్మరణతో శైవక్షేత్రాలు మార్మోగాయి.. ఆ సర్వేశ్వరుడిని మనసారా పూజించి భక్తులు తన్మయత్వం చెందారు.. ఆ గంగాధరుని రూపం చూసి ఆనంద పరవశితులయ్యారు.. కార్తికమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని శివాలయాలు భక్తులతో కోలాహలంగా మారాయి.. తెల్లవారుజామునే పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ప్రత్యేక పూజలు, సామూహిక అభిషేకాలు, ధ్వజస్తంభాల వద్ద దీపారాధనలు చేశారు. తుని రూరల్‌లోని తేటగుంట, టి.తిమ్మాపురం, హంసవరం, చామవరం, జగన్నాథగిరి తదితర గ్రామాల్లో ఆలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. తేటగుంటలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. ఎస్.అన్నవరంలో శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి పుష్కరిణి వద్ద భక్తుల రద్దీ నెలకొంది. ఏలేశ్వరంలోని రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి అర్చకులు శేఖర్, మహేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. లింగంపర్తి, సిరిపురం గ్రామాల్లోని శివాలయాల్లో ధ్వజస్తంభాల వద్ద మహిళలు కార్తిక దీపాలు వెలిగించారు. తొండంగి రామలింగేశ్వరస్వామి ఆలయంలో పంచామృతాభిషేకాలు, లక్షపత్రిపూజ, బిల్వార్చనలు జరిగాయి. ఒంటిమామిడి, బెండపూడి విశ్వేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గోపాలపటన్నం ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామికి సప్త నదీజలాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం గ్రామ పెద్దలు, దాతల సహకారంతో అన్నసమారాధన జరిగింది. మండలంలోని వివిధ ఆలయాల్లో కమిటీల ఆధ్వర్యంలో దాతల సహకారంతో పులిహోర, మజ్జిగ, పాలు పంపిణీ చేశారు.

నందనవనం.. ఆధ్యాత్మిక సోయగం

శృంగవరం- మెరక చామవరం సమీపంలోని నందనవనంలో ఉమావర్ధిని నాగలింగేశ్వరస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. కుటుంబ సమేతంగా ఆలయానికి వెళ్లి స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయ కమిటీల నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్తిక త్రయోదశి పర్వదినం సందర్భంగా ఆలయ సన్నిధిలోని మహానందీశ్వర స్వామికి భక్తులు మహాభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. రౌతులపూడిలో ఉమా రామలింగేశ్వరస్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట, తాళ్లూరు, ఉప్పలపాడు, మల్లేపల్లి, గండేపల్లి, మురారి, యల్లమిల్లి తదితర గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కళకళలాడాయి. తాళ్లూరులోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో విఘ్నేశ్వర పూజ, ఏకాదశ రుద్రాభిషేకాలు వైభవంగా జరిగాయి. ఆలయ నిర్మాణ కర్తలు శిష్ట వెంకటరమణ, పద్మలత దంపతులు, గ్రామస్తులు పాల్గొన్నారు. గోకవరంలో పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో ధ్వజస్తంభం వద్ద మహిళలు కార్తిక దీపాలు వెలిగించారు. రమా సత్యనారాయణ స్వామివారి ఆలయంలో కొలువైన ఉమా సమేత గోకర్ణేశ్వరస్వామివారి ఆలయానికి విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కొత్తపల్లిలో రెడ్డిరాజుల కాలం నాటి బాలాత్రిపుర సుందరీ సమేత రాజలింగేశ్వర స్వామివారి ఆలయం, గోకవరం మురళీనగర్‌లోని సాయిబాబా ఆలయంలో కొలువైన సోమేశ్వర స్వామి, తంటికొండలో అఖిలాండేశ్వరీ సమేత జంభుకేశ్వరస్వామివారి ఆలయం, కృష్ణునిపాలెంలో పార్వతీ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ప్రత్తిపాడులోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామివారి పంచాయతన ఆలయం భక్తులతో నిండిపోయింది. ధ్వజస్తంభం వద్ద, సాయి మందిరం, దుర్గమాత ఆలయం, స్థానిక అభయ ఆంజనేయ స్వామి ఆలయం, వేణుగోపాల స్వామివారి ఆలయాల్లో దీపారాధనలు జరిగాయి. స్థానిక శివాలయంలో ఆలయ ప్రధానార్చకుడు కొత్తలంక సాయి ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు నిర్వహించారు. నరేంద్రగిరి సమీపంలోని పుష్కర కాలువలో మహిళలు కార్తిక దీపాలను వదిలిపెట్టారు. అన్నవరం పంపా సత్రం వద్ద ఉన్న శ్రీగంగా పార్వతీ సమేత భూలోకేశ్వర స్వామివారి ఆలయం వద్ద నిర్వహించిన అన్నసమారాధనకు భారీ సంఖ్యలో భక్తులు వచ్చారు. దాతల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ కమిటీ తెలిపింది.



తాళ్లూరులో శివలింగానికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

దివ్యాంగులకు ప్రభుత్వం భరోసా



వేడుకల్లో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువత అధ్యక్షుడు ఏలూరి బాలు

తుని రూరల్: సమాజంలో దివ్యాంగులు అందరిలా ముందడుగు వేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని తుని మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువత అధ్యక్షుడు ఏలూరి బాలు తెలిపారు. సోమవారం స్థానిక భవిత కేంద్రంలో ఎంఈఓ పరవాడ గీతాదేవి అధ్యక్షతన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు, వైస్ చైర్మన్ పామర్తి మహేష్, జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజాతో కలసి ఆయన కేక్ కట్ చేశారు. దివ్యాంగ చిన్నారులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పోతల రమణ, ఎంఈఓ-2 ఎ.రామకృష్ణ, భవిత కేంద్రం ఉపాధ్యాయులు ఎం.రాంబాబు, ఎన్.శ్రీనివాసు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



శంఖవరంలో బాల్య వివాహాల నివారణపై పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

శంఖవరం: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. స్థానిక సత్యదేవ కల్యాణ మండపం ఆవరణలో సోమవారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో సీడీపీఓ పద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన తరువాత ఆడ పిల్లలకు పెళ్లి చేయడం శ్రేయస్కరమన్నారు. కొంత మంది తల్లిదండ్రులు అవగాహన లోపం కారణంగా చిన్న వయసులోనే వివాహాలు చేయడం ద్వారా ఆడ పిల్లలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామాల్లో తిరిగి బాల్య వివాహాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. జెడ్పీటీసీ సభ్యులు తరుం రాజేశ్వరి, ఏపీ ఎస్సీపీసీఆర్ ఆదిలక్ష్మి, సీతామహాలక్ష్మి, సంతోషికుమారి, డీసీపీఓ వెంకట్రావు, శైలజ, ఎంపీడీఓ జి.శివరామకృష్ణ, ఎంఈఓ ఎస్వీ రమణ, రౌతులపూడి తహసీల్దార్ భీమారావు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాన్ని వెలికితీద్దాం

క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను ప్రారంభించిందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. స్థానిక సత్యదేవ కల్యాణ మండపంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బందికి స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. గ్రామాల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిన క్రీడాకారులను మండల స్థాయికి ఎంపిక చేస్తారన్నారు.

పంచాయతీలకు ఆదాయమే లక్ష్యం



టీజే నగరంలో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్

కోటనందూరు: పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చడమే లక్ష్యంగా చెత్త నుంచి సంపద కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు పంచాయతీ విస్తరణాధికారి జి.అరుణ్‌కుమార్ అన్నారు. సోమవారం టీజే నగరంలో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. కేంద్రం నిర్వహణ, రికార్డులు, వర్మికం పోస్టు తయారీ విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తయారు చేసిన వర్మికంపోస్టును ఎప్పటికప్పుడు విక్రయించి పంచాయతీకి ఆదాయాన్ని సమకూర్చాలని సిబ్బందికి సూచించారు. కేంద్రాల వద్ద రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని షెడ్ మిత్రను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి రావాడ రామచంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



తునిలో ఏలూరి బాలును సత్కరిస్తున్న పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

తుని: స్థానిక సాయినగర్ జీఎస్టీ చర్చిలో తుని టౌన్, రూరల్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. మత పెద్దలు క్రీస్తు బోధనలు వివరించారు. ప్రజలంతా క్రీస్తు సూచించిన మార్గంలో నడవాలని అన్నారు. అనంతరం మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలును సత్కరించారు. ఎంపీపీ బొప్పన రాము, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, నాయకులు పోతల రమణ, షేక్ ఖ్వాజ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఫిలిప్, పాస్టర్లు సాల్మన్‌రాజు, లిమ్మ, జాన్‌డేవిడ్, కేజే ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గోకవరంలో..

గోకవరం: నియోజకవర్గ ఐక్య గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు ఆదివారం రాత్రి గోకవరంలో ఘనంగా జరిగాయి. జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ ఉపాధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్ హాలోనెన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, రాష్ట్ర పెంతెకోస్తు అధ్యక్షుడు జాన్ లాజరస్, స్టేట్ సెక్రటరీ మత్రి డానియల్, ఏపీ ఏపీసీ అధ్యక్షుడు రైమో జుహానీ హాలోనెన్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. తొలుత భారీ కేక్‌ను కట్ చేసి క్రిస్మస్ సందేశాన్ని అందజేశారు.

వచ్చే ఎన్నికల్లో విజయం మనదే



యల్లమిల్లిలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



తిరుమలాయపాలెంలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- యల్లమిల్లిలో 'వై ఏపీ నీడ్స్ జగన్'
- వైఎస్సార్ సీపీ జెండాల ఆవిష్కరణ

గండేపల్లి: సీఎం జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో పేదల ఇంట వెలుగులు వచ్చాయని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయమని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. సోమవారం యల్లమిల్లిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ పథకాలు అందుతున్నాయన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పారదర్శకతకు పెద్దపీట వేస్తూ నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే పథకాల సొమ్ము వేస్తున్నారన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ప్రభుత్వ పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ప్రజలంతా మద్దతుగా నిలవాలన్నారు. ముందుగా దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ పతాకాన్ని, పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఏఎంసీ చైర్మన్ జనపరెడ్డి బాబు, వైస్ ఎంపీపీ కుంచే రాజా, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, ఎంపీటీసీ సభ్యులు గొల్లేపల్లి అశ్విని, సర్పంచ్ నూకతట్టు నాగజ్యోతి, ఉప సర్పంచ్ కోన గంగాధర్, గొల్లేపల్లి రావిబాబు, సుంకవిల్లి సత్యసాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: రాజపూడిలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాలలో భాగంగా అర్హత గల ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నట్టు తెలిపారు. ముందుగా పార్టీ జెండాను, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం, పార్టీ మండల అధ్యక్షుడు ఒంటిపిల్లి రామన్నదొర, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి

గోకవరం: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. తిరుమలాయపాలెం గ్రామంలో సోమవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించారు. స్థానిక సచివాలయంలో సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారుల వివరాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో పార్టీ శ్రేణులతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. రానున్న ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలో ప్రసిద్ధి గాంచిన లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళ్లే దారిలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, మండల కన్వీనర్ పాటి రాంబాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, ఉప సర్పంచ్ దుర్గాప్రసాద్, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, నాయకులు సరాలశెట్టి సర్వయ్య, ఎంపీడీఓ పద్మాజ్యోతి, ఈఓపీఆర్డీ రాజేశ్వరరావు, కార్యదర్శి గోవిందు పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి అండగా ఉందాం

ప్రత్తిపాడు: నాలుగున్నరేళ్లుగా అవినీతి రహిత పాలన సాగిస్తూ, రాష్ట్రాన్ని సంక్షేమం దిశగా తీసుకువెళ్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలుద్దామని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు కోరారు. రామచంద్రాపురం, సింహాద్రిపురం గ్రామాల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటైన సభలలో ఎమ్మెల్యే చంటిబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమానికి, గ్రామాల అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. ఆయా సచివాలయాల్లో లబ్ధిదారుల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డులను, పార్టీ పతాకాలను ఎమ్మెల్యే విష్కరించారు. ఎంపీపీ తోట రవి, జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, సర్పంచులు తుమ్మల భవన శేఖర్, కె.కాశీ విశ్వనాథం, ఎంపీటీసీ సభ్యులు బండారు వరప్రసాద్, నంది వెంకన్న, నాయకులు చదలవాడ బాబీ, తోట గాంధీ, దోమాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పట్టాదారులపై చర్యలు తీసుకోండి



జేసీ భరత్‌తేజ్‌కు వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు వీరబాబు, లబ్ధిదారులు

గోకవరం: గోకవరం ఇందిరమ్మ మోడల్ కాలనీలో ఖాళీ స్థలాలను నకిలీ పట్టాలతో ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు పలువురు లబ్ధిదారులతో కలసి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం రాజమహేంద్రవరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో జేసీ భరత్‌తేజ్‌కు వినతి పత్రం అందజేశారు. గతంలో తమకు స్థలాలు కేటాయించగా పలు కారణాలతో ఇళ్లు నిర్మించుకోలేకపోయామని, వాటిని కొందరు ఆక్రమించుకుని నకిలీ పట్టాలు సృష్టించి తమపై దౌర్జన్యం చేస్తున్నారని లబ్ధిదారులు వాపోయారు. దీనిపై తగు చర్యలు తీసుకుని తమ స్థలాలు తమకు అప్పగించాలని కోరారు.

డయల్ యువర్ డీఎంకు ఫిర్యాదులు

ఏలేశ్వరం: స్థానిక ఆర్టీసీ డిపోలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎంకు పలు ఫిర్యాదులు వచ్చాయని డీఎం సత్యనారాయణ తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో డీఎం అధ్యక్షతన ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ ఈ కార్యక్రమం జరిగింది. తమ గ్రామాల మీదుగా బస్సు సర్వీసులు నడపాల ని ప్రయాణికులు కోరినట్లు డీఎం తెలిపారు.

ముంపు పొలాల పరిశీలన



ఎ.కొత్తపల్లి ఆవ వద్ద ముంపులో ఉన్న వరి పొలాలను పరిశీలిస్తున్న జేసీ ఇలక్కియ

తొండంగి: మండలంలోని పి.అగ్రహారం, ఎ.కొత్తపల్లి గ్రామాల్లో తుపానుకు ముంపునకు గురైన పొలాలను జేసీ ఇలక్కియ సోమవారం పరిశీలించారు. జేడీఏ విజయ్‌కుమార్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో కలసి పంపా మిగులు జలాల విడుదల కారణంగా ముంపులో ఉన్న పొలాలను పరిశీలించారు. అదేవిధంగా ఎ.కొత్తపల్లి ఆవలో ముంపులో ఉన్న వరి పంట కుళ్లిపోవడాన్ని పరిశీలించారు. మండల వ్యాప్తంగా తుపానుకు దెబ్బతిన్న పంటల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. దాదాపు 8 వేల ఎకరాలకు పైగా వరి పంట వివిధ దశల్లో దెబ్బతిన్నట్లు వారు వివరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి త్వరితగతిన నివేదిక పంపాలని జేసీ ఆదేశించారు. ఆమె వెంట తుని ఏడీఏ సుంకర బుల్లిబాబు, తహసీల్దార్ జి.సుబ్రహ్మణ్యం, ఏఓ ఎస్.నరసింహం, ఆర్ఐ వెంకటేశ్వరరావు, ఏఈఓ కొప్పన దైవప్రసాద్ తదితరులు ఉన్నారు.

కష్టాలు దాటించండి



బొద్దవరం వద్ద నిర్మించిన తాత్కాలిక వంతెన కొట్టుకుపోయిన ప్రాంతం

కోటనందూరు: బొద్దవరంలో తాండవ నదిపై రైతులు తాత్కాలికంగా నిర్మించుకున్న వంతెన మిచాంగ్ తుపానుతో వచ్చిన నీటి ఉధృతికి కొట్టుకుపోయింది. ఆ గ్రామస్తులకు తాండవ నది అవతలి వైపు పంట పొలాలు, వ్యవసాయ పకాలు ఉన్నాయి. వేసవిలో నదిలో ప్రవాహం పెద్దగా ఉండకపోవడంతో రాకపోకలకు ఇబ్బంది ఉండదు. వర్షాకాలంలో నదిలో నీరు ఎక్కువగా ప్రవహించేటప్పుడు రాకపోకల సమస్య తలెత్తుతోంది. వ్యవసాయ మకాలకు వెళ్లాలన్నా, పండించిన ధాన్యాన్ని గ్రామానికి చేర్చాలన్నా పెద్ద సమస్య ఎదురవుతోంది. ప్రత్యామ్నాయ మార్గంలో పొలాలకు, వ్యవసాయ మకాలకు వెళ్లాలంటే 10 కిలోమీటర్లకు పైగా ప్రయాణించాల్సిన వస్తోంది. గతేడాది రైతులంతా రూ. 50 వేల వరకూ సమకూర్చుకుని తాటి పట్టెలతో తాత్కాలిక వంతెన నిర్మించుకున్నారు. నిర్మించిన వంతెన కొద్ది రోజులలోనే రెండు పర్యాయాలు నదిలో కొట్టుకుపోయినా, మూడోసారి కూడా నిర్మించుకున్నారు. మిచాంగ్ తుపాను ప్రభావంతో ఇటీవల నది ఉగ్రరూపం దాల్చడంతో మరోమారు వంతెన నదిపాలైంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఇక్కడ శాశ్వత వంతెన నిర్మించాలని రైతులు కోరుతున్నారు.